sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 12-08-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 126 EDITOR: ROHINI



అనాథగా దేవుడు... అండగా దివ్యకార్యం

ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టిన హైదరాబాద్ కార్పొరేషన్

- రీసైక్లింగ్ బాటలో పాత పూజా సామగ్రి
- పాత పటాలు, పూజా సామగ్రికి ఉద్వాసన
- పర్యావరణ పరిరక్షణ... నూతన పరిష్కారం
- దేవుడికి గౌరవప్రదమైన వీడ్కోలు
- మనసును హత్తుకునే మహా యజ్ఞం!

ఏళ్ల తరబడి పూజించిన దేవుడి విగ్రహాలు, పటాలు, పూజా సామాగ్రి దెబ్బతింటే ఏం చేయాలో తెలియక భక్తులు సతమతమవుతుంటారు. నగరంలో ఇన్నాళ్లూ సరైన మార్గం లేక ఇబ్బంది పడ్డ పౌరులకు జీహెచ్ఎంసీ 'ప్రాజెక్ట్ ఉద్వాసన' ద్వారా ఒక గొప్ప ఉపశమనం లభించింది. భక్తి భావనకు భంగం కలగకుండా, పర్యావరణాన్ని కాపాడుతూ వీటిని గౌరవప్రదంగా సాగనంపే ప్రక్రియను ప్రారంభించారు.

- సహనం వందే, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో వేలాది ఇళ్లలో పాతబడిన దేవుడి ఫోటోలు, దెబ్బతిన్న విగ్రహాలు, క్యాలెండర్లు, పూజా సామగ్రి పేరుకుపోయాయి. వీటిని గౌరవంగా పారవేసే వ్యవస్థ లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రజలు వీటిని పూజా మందిరాల్లోనే దశాబ్దాల పాటు ఉంచేస్తున్నారు. చివరకు దిక్కుతోచక చెట్ల కింద పడేస్తున్నారు. మరికొందరు నదులు, చెరువులు లేదా మున్సిపల్ చెత్తలో వేస్తున్నారు. దీనివల్ల పవిత్ర వస్తువులు కలుషితమై భక్తుల మనసులు తీవ్రంగా గాయపడుతున్నాయి.

ప్రాజెక్ట్ ఉద్వాసన రూపకల్పన

ఈ సమస్యను గమనించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఒక గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చింది. ఈ ఏడాది నుంచి ప్రాజెక్ట్ ఉద్వాసనను అమలులోకి తెచ్చింది. భక్తిని, పర్యావరణ పరిరక్షణను ఒకే తాటిపైకి తెచ్చిన కార్యక్రమమిది. పవిత్ర వస్తువులకు ఉద్వాసన పూజ చేసి పంపడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. ప్రజలకు తమ నిష్ఠను కాపాడుకోవడానికి ఇది సురక్షితమైన మార్గంగా మారింది.

గౌరవప్రదమైన సేకరణ పద్ధతి

ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకంగా మారింది. పౌరులు తమ ఇళ్లలోని దేవుడి పటాలు, విగ్రహాలు, పూజా పదార్థాలను ఈ కేంద్రాలకు తెచ్చి ఇస్తున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఆ సామగ్రిని వేరు చేసి భద్రపరుస్తున్నారు. సాంప్రదాయబద్ధంగా దేవుళ్లకు గౌరవ వీడ్కోలు మంత్రాలతో ఈ పూజా విధానం సాగుతుంది. మానసిక ప్రశాంతతతో పాటు బాధ్యతాయుతమైన నాగరికతను ఇది నగరంలో పెంచుతోంది.

వ్యర్థాల శాస్త్రీయ పునర్వినియోగం

సేకరించిన వస్తువులను వేరు చేయడం ఈ ప్రాజెక్ట్‌లో మరో ముఖ్యం. ఫోటోలకు ఉన్న ఫ్రేములు, గాజులు, కాగితాలు, విగ్రహాల పదార్థాలను విడదీస్తారు. అనంతరం వాటిని పర్యావరణానికి హాని కలగని రీతిలో రీసైక్లింగ్ చేస్తారు. భక్తి సామాగ్రి నగరంలో చెత్తగా మారకుండా ఇది అడ్డుకట్ట వేస్తోంది. చెత్త నిర్వహణలో భాగమైన ఈ పద్ధతి వల్ల నగర వీధులు, జలవనరులు పరిశుభ్రంగా మారుతున్నాయి.

పర్యావరణ శ్రేయస్సుకు ఊతం

ఈ కొత్త వ్యవస్థ వల్ల హైదరాబాద్ లోని జలవనరులు, పచ్చదనం రక్షిస్తారు. నీటిలో రసాయనాలు కలిసే ప్రమాదం పూర్తిగా తప్పింది. చెట్ల కింద పడేసే పాత సామాగ్రి వల్ల పరిసరాలు అశుభ్రం కావడం ఆగింది.

నగర పారిశుధ్యంలో ఇది ఒక మైలురాయిగా నిలిచింది. పౌరులు కూడా ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తమ పవిత్ర బాధ్యతను నిలబెట్టుకుంటున్నారు.

భక్తికి పర్యావరణ జోడింపు

సాంప్రదాయం, ఆధునిక పర్యావరణ పరిరక్షణ కలిసి నడవచ్చని ఈ ప్రాజెక్ట్ నిరూపించింది. నగర ప్రజల్లో దీనివల్ల సరికొత్త చైతన్యం వచ్చింది. పవిత్రమైన రీతిలో సాగనంపడం వల్ల భక్తుల్లోని ఆందోళన తొలగిపోయింది. స్వచ్ఛ హైదరాబాద్ నిర్మాణంలో ప్రాజెక్ట్ ఉద్వాసన కీలకాంశంగా మారింది. రాబోయే రోజుల్లో ఇతర నగరాలకు ఇది ఒక గొప్ప మార్గదర్శకంగా నిలుస్తుంది.

ప్రకాష్ రాజ్ ఓటు గల్లంతు

ఓటు హక్కు కోల్పోయిన నటుడు

- కర్ణాటకలో 75 లక్షల ఓట్లు మాయం
- బెంగళూరులో తీవ్ర రాజకీయ దుమారం
- ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు

పుట్టి పెరిగిన గడ్డపైనే ఒక ప్రముఖ నటుడికి ఓటు హక్కు కరువైంది. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి గళాన్ని అణచివేసేలా ఎన్నికల జాబితాల పేరుతో సాగుతున్న భారీ కుట్రలను ఈ ఘటన బట్టబయలు చేస్తోంది. వ్యవస్థలోని లోపాలు, అధికార దుర్వినియోగంపై నటుడు ప్రకాష్ రాజ్ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి.

- సహనం వందే, బెంగళూరు

ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోతో దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చ మొదలైంది. తాను కేవలం సాధారణ పౌరుడు మాత్రమే కాకుండా బెంగళూరు నియోజకవర్గంలో పుట్టి పెరిగిన స్థానికుడినని ఆయన స్పష్టం చేశారు. అదే నియోజకవర్గంలో పాఠశాల విద్య, కాలేజీ చదువు, నాటక రంగానికి సంబంధించిన అనుబంధం అన్నీ ఉన్నాయని తెలిపారు. ఒకప్పుడు అదే నియోజకవర్గం నుంచి తాను ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశానని గుర్తు చేశారు. ఇప్పుడు తన ఓటు హక్కునే ప్రశ్నార్థకం చేయడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

75 లక్షల ఓట్ల మాయం

ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియ తర్వాత బెంగళూరులో భారీగా ఓట్లు తొలగిపోయినట్లు వెల్లడైంది. మొత్తం 75 లక్షల మంది ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి మాయం అయ్యాయని ప్రకాష్ రాజ్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఇందులో తన పేరు కూడా ఉండటం ఒక జోక్ లాగా అనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి అత్యంత విలువైన ఓటు హక్కును ఇలా ఏకపక్షంగా తొలగించడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు ఈ తప్పు ఎక్కడ జరిగిందనే దానిపై ఆయన తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు.

పౌరసత్వంపై వ్యంగ్యాస్త్రాలు

తన ఓటరు ఐడీని మళ్లీ వెనక్కి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తానన్నారు. క్యా క్యా కాగజ్ దిఖాన పడేగా అంటూ ఆయన హిందీలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం లేదా అధికారుల నిబంధనల ప్రకారం ఓటు పొందడానికి తానేమీ నిరూపించుకోవాల్సి వస్తుందోనని ఆయన వ్యంగ్యంగా మాట్లాడారు. పుట్టి పెరిగిన గడ్డపైనే పౌరసత్వాన్ని లేదా ఓటు హక్కును నిరూపించుకోవాల్సిన పరిస్థితి రావడం పట్ల ఆయన పరోక్షంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపుతోంది.

అధికార పార్టీపై తీవ్ర విమర్శలు

ఈ విషయంలో కేంద్రంలోని అధికార పార్టీపై ప్రకాష్ రాజ్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. తమను వ్యతిరేకించే వారిని లేదా తమకు ఓటు వేయని వారిని రాజకీయంగా అణచివేయడానికి అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పౌరుల ఓటు హక్కును లాక్కునే అధికారం ఎవరికీ లేదని ఆయన గట్టిగా చెప్పారు. ఒకవేళ ఓట్లు తొలగిస్తే తాము ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపేస్తామని అనుకుంటున్నారా అంటూ ఆయన సూటిగా నిలదీశారు. మిమ్మల్ని గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇలాంటి చర్యలతో వారి గొంతును ఎప్పటికీ నొక్కలేరని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల సంఘం రికార్డుల్లో ఏముందంటే?

ప్రకాష్ రాజ్ చేసిన ఈ సంచలన ఆరోపణలపై ఎన్నికల సంఘం అధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అయితే ప్రాథమిక సమాచారం ప్రకారం ఆయన పేరు బెంగళూరు సెంట్రల్ పరిధిలోని శాంతినగర్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో ఆయన పేరు గైర్హాజరైన, శాశ్వతంగా మారిన, మరణించిన లేదా నకిలీ ఓట్ల జాబితాలో చేర్చారు. ఆయన ఆ ప్రాంతం నుంచి శాశ్వతంగా మారిపోయారనే కారణంతోనే పేరు తొలగించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ సాంకేతిక కారణం వెనుక నిజానిజాలు ఏంటనేది అధికారుల అధికారిక ప్రకటన వస్తేనే స్పష్టమవుతుంది.

న్యాయం ఖరీదు 83 వేల కోట్లు

శిక్ష తప్పించుకున్న గౌతమ్ అదానీ

- అమెరికాలో అవినీతి కేసు కొట్టివేత
- న్యాయ వ్యవస్థకు తూట్లు
- తెరవెనుక చీకటి ఒప్పందాలు
- కార్పొరేట్ శక్తుల విజయం

అమెరికా గడ్డపై భారతీయ కుబేరుడు గౌతమ్ అదానీపై నమోదైన వేల కోట్ల లంచాలు, మోసాల కేసును ట్రంప్ ప్రభుత్వం కొట్టివేసింది. ఎఫ్‌బీఐ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ దర్యాప్తును పూర్తిగా పక్కనపెట్టి బ్రూక్లిన్ ఫెడరల్ జడ్జి నికోలస్ గారౌఫిస్ చేత ఈ కేసును బలవంతంగా కొట్టివేయించిన వైనం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. - సహనం వందే, ఢిల్లీ

భారతీయ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి సంబంధించి అమెరికా న్యాయస్థానంలో జరుగుతున్న ఒక పెద్ద లీగల్ పోరాటానికి తెరపడింది. సోమవారం బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టు ఈ కేసును అధికారికంగా రద్దు చేసింది. 2024 సంవత్సరంలో అదానీ మీద కొన్ని తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. మన దేశంలో సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు దక్కించుకోవడం కోసం సుమారు 2220 కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని లంచాలుగా ఇచ్చారనేది ఆ ప్రధానమైన ఆరోపణ. దీనిపై అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ అలాగే న్యాయ విభాగం దర్యాప్తు కూడా చేపట్టింది.

రాజకీయ నాటకాలతో కేసు రద్దు

అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసులో అనూహ్యమైన మలుపు తిరిగింది. ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా ఈ మోసం, లంచం ఆరోపణల కేసును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ప్రాసిక్యూటర్లు చేసిన ఈ అభ్యర్థనను ఫెడరల్ జడ్జి నికోలస్ గారౌఫిస్ ఆమోదించడంతో కేసు ముగిసింది. మొదట్లో ఈ కేసుపై తీవ్రంగా విచారణ జరిపిన కోర్టు, ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో ఆరోపణలను అధికారికంగా కొట్టేయాల్సి వచ్చింది.

న్యాయమూర్తి ఆగ్రహం... రహస్య ఒప్పందాలు

ఈ కేసును ఉపసంహరించుకున్న తీరు మాత్రం అమెరికా న్యాయ వ్యవస్థలో తీవ్రమైన చర్చకు దారితీసింది. ట్రంప్ నియమించిన డిప్యూటీ అసోసియేట్ అటార్నీ జనరల్ ట్రెంట్ మెక్కోటర్ వ్యవహరించిన తీరుపై జడ్జి నికోలస్ గారౌఫిస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసును విచారించిన ఎఫ్‌బీఐ అధికారుల నుంచి గాని, ఎస్ఈసీ ఏజెంట్ల నుంచి గాని ఎటువంటి ఇన్‌పుట్స్ తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేవలం డిఫెన్స్ కౌన్సిల్‌తో కలిసి అత్యంత రహస్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా అసాధారణమైన విషయమని జడ్జి బహిరంగంగానే తన అసహనాన్ని ప్రదర్శించారు.

83 వేల కోట్లతో బేరసారాలు...

ఈ కేసు తొలగింపు వెనుక పెద్ద ఎత్తున ఆర్థిక ఒప్పందాలు జరిగాయనే ఆరోపణలు కూడా అమెరికా మీడియాలో పెద్ద ఎత్తున చక్కర్లు కొట్టాయి. అదానీ తరపు న్యాయవాది రాబర్ట్ గియుఫ్రా ఏప్రిల్ నెలలో జస్టిస్ డిపార్ట్‌మెంట్ అధికారులను కలిశారని వార్తలు వచ్చాయి. ఒకవేళ ఈ క్రిమినల్ కేసులను కనుక పూర్తిగా ఎత్తివేస్తే, అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఏకంగా 83 వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు పెట్టడానికి అదానీ సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రతిపాదించినట్లు మీడియా కోడైకూసింది. ఈ పెట్టుబడి ప్రతిపాదన కారణంగానే ప్రభుత్వం కేసును వెనక్కి తీసుకుందా అనే కోణంలో జడ్జి కూడా ఒక దశలో అనుమానం వ్యక్తం చేశారు.

అదానీ ఖండన...

ఈ ఆరోపణలన్నింటినీ అదానీ వర్గాలు పూర్తిగా ఖండించాయి. కేసుకు సంబంధించిన తొలగింపునకు ఎలాంటి ముందస్తు ఒప్పందాలు లేవని ఆయన స్పష్టం చేస్తూ ఒక ప్రమాణపత్రాన్ని కూడా సమర్పించారు. అదానీ గ్రూప్ అనేది మన దేశంలో ఓడరేవులు, విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమల నుంచి మీడియా హౌస్‌ల వరకు ఎన్నో రంగాల్లో విస్తరించి ఉన్న అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యం. ఇటీవల కాలంలో కొన్ని కార్పొరేట్ మోసాల ఆరోపణలు, స్టాక్ మార్కెట్ క్రాష్‌ల వల్ల అదానీ కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారు.